క్లుప్తంగా

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు


ఎన్నికల విధులపై శిక్షణ ఇస్తున్న సీఐ శ్రీనివాస్

దెందులూరు: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని దెందులూరు అసెంబ్లీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి, పెదవేగి సీఐ కె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కె.స్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ఉమెన్ పీసీలతో శిక్షణ ఇచ్చారు. భారత ఎన్నికల సంఘం, పోలీస్ శాఖ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

బాధ్యతల స్వీకరణ


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: మండలంలోని ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిణిగా డాక్టర్ కస్తూరి శిరీష బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యశాలలో అన్ని రకాలైన దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదం ద్వారా చికిత్స అందజేస్తామన్నారు.

వైభవంగా పాటెమ్మవారి వార్షికోత్సవాలు


పాటెమ్మ తల్లి దర్శించుకున్న భక్తులు

దెందులూరు: భక్తుల కోర్కెలుతీర్చే కల్పవల్లి పెరుగ్గూడెం గ్రామ దేవత యలమర్తి వారి ఆడపడుచు, చల్లచింతలపూడి శివారు తిమ్మన్నగూడెం – పెరుగ్గూడెం గ్రామాల మధ్య వెలసిన శ్రీ పాటెమ్మవారి ఆలయ రెండో వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టు ఫౌండర్ యలమర్తి శ్రీనివాస్, హేమలత, ట్రస్టు సభ్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ, సారె, 108 కలశాల, 108 బిందెలతో జలాభిషేకం, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ


సుబ్బయ్య కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జాలిపూడి గ్రామానికి చెందిన మాత్రపు సుబ్బయ్య (25)కు బుధవారం ఏలూరు వైద్యశాలలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, జెడ్పీటీసీ మండలి సరస్వతి కొండలరావు, ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, పార్టీ మండల అధ్యక్షులు తేరా ఆనంద్, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వ్యాయామ కళాశాలలో యోగా తరగతులు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో 45 రోజుల యోగా క్లాసులు ప్రారంభించామని ప్రిన్సిపాల్ ఎస్ నత్తానియేలు బుధవారం తెలిపారు. కళాశాలలో యూజీడీ, డీపీఈడీ కోర్సులు ఉన్నాయని, వాటితోపాటు విద్యార్థుల సంపూర్ణ, ఆరోగ్య పరిరక్షణ, మానసిక ఒత్తిడిని నివారించేందుకు యోగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 45 రోజులు సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించామని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, యూజీడీ, డీపీఈడీ విద్యార్థులు ప్రిన్సిపాల్‌ను సత్కరించారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

ఉంగుటూరు: మండలంలోని పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. బుధవారం నిర్వహించిన ఇంగ్లీషు పరీక్షకు మొత్తం 714 మంది విద్యార్థులకు గాను 690మంది విద్యార్థులు హాజరయ్యారు. 24మంది హాజరు కాలేదు. ఉంగుటూరు మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలియజేశారు.

ఉపాధి పనుల పరిశీలన

ఏలూరు రూరల్ : ఉపాధి హామీ పని ప్రాంతంలో తాగునీరు, మెడికల్ కిట్లు, టెంట్లు అందుబాటులో ఉంచాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.రాము పరిశీలించారు. బుధవారం ఆయన ఏలూరు రూరల్ గ్రామం గుడివాకలంకలో ఉపాధి పనులు, కూలీల మస్తర్లను పరిశీలించారు. కూలీలకు కనీస వసతులు ఏర్పాటు చేయాలన్నారు.

‘అమ్మఒడి’తో పేదలకు అండ

- 15 గ్రామాల్లో 4,241 మందికి లబ్ధి
- నాలుగేళ్లలో తల్లుల ఖాతాల్లో రూ.19.14 కోట్ల జమ
- విద్యా వ్యవస్థకు అండగా నిలిచిన అమ్మఒడి పథకం


అమ్మఒడి పథకం అందుకున్న ఏలూరు రూరల్ గ్రామాల తల్లులు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తోన్న అమ్మఒడి పథకం గ్రామాల్లో పేదల చదువుకు అండగా మారింది. రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేదలకు వరమైంది. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతోన్న విద్యార్థుల తల్లులకు ప్రభుత్వం ఏటా రూ.15 వేలు అందిస్తోంది. ఇందులో రూ.2 వేలు ప్రభుత్వ పాఠశాల పరిశుభ్రతకు తల్లులు చెల్లిస్తున్నారు. మిగిలిన మొత్తంతో తమ బిడ్డల చదువు కోసం ఖర్చు చేస్తున్నారు. ఫలితంగా ఏ ఆటంకం లేకుండా పిల్లల చదువు కొనసాగడంతో పాటు పేద కుటుంబాలపై ఒత్తిడి తగ్గింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో 4,241 మంది తల్లుల ఖాతాల్లో రూ.19,14,86,931 జమచేసి పిల్లల చదువుకు అండగా నిలిచింది.

నాలుగేళ్లగా అమ్మఒడి లబ్ధి ఇలా..

ఏలూరు రూరల్ మండల 15 గ్రామాల్లో నాలుగేళ్లగా తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిన నగదు వివరాలిలా ఉన్నాయి. చాటపర్రులో 729మంది విద్యార్థుల తల్లులకు రూ.3,25,55,48, పైడిచింతపాడులో 279 మందికి రూ.1,29,34,274, ప్రత్తికోళ్లలంకలో 412 మందికి రూ.1,80,93,096, కోటేశ్వరదుర్గాపురంలో 102మందికి రూ.48,49,800, కోమటిలంకలో 127 మందికి రూ.54,12,133, శ్రీపర్రులో 528 మంది ఖాతాల్లోకి రూ.2,37,34,614 జమైంది. కొల్లేరు శివారు గ్రామం పెదయాగనమిల్లిలో 53 మందికి రూ.24,91,000, గుడివాకలంకలో 667 మందికి రూ.2,97,27,756, జాలిపూడిలో 501 మందికి రూ.2,27,93,823, మల్కాపురంలో 323 మందికి రూ.1,53,12,739, మాదేపల్లిలో 520 మంది రూ.2,35,84,948 అందుకున్నారు.

అమ్మఒడి మరువలేనిది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన అమ్మఒడి పథకం నాలాంటి కుటుంబానికి అండగా నిలిచింది. ఈ పథకం పేదలు ఎన్నటికీ మరిచిపోలేరు. గతంలో సంపాదించిన డబ్బు సగం పిల్లల చదువు కోసమే సరిపోయేది. కొన్నిసార్లు ప్రైవేటు స్కూల్ ఫీజులు కట్టలేక పిల్లలు బడికి వెళ్లేవారు కాదు. ఏడాదికి రూ.15 వేలు చొప్పున అందడం వల్ల పిల్లల చదువులు సాఫీగా సాగుపోతున్నాయి.

– ఎస్ వెంకటరమణ, కోటేశ్వరదుర్గాపురం

పేదలకు ఆదరణ



ముఖ్యమంత్రి ఏ పథకం పెట్టినా పేదలకు అండగా ఉంది. అమ్మఒడి పథకం ద్వారా నాలుగేళ్లలో రూ.60 వేలు అందుకున్నాను. ఇలాంటి పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయి. ఇప్పుడు పిల్లల చదువుకు కోసం బెంగలేదు. పిల్లలు పెద్ద చదువులు చదివితేనే కదా, పేదల కుటుంబాలు బాగుపడతాయి. ఈ విషయాన్ని జగన్ గ్రహించి ఈ పథకం పెట్టారు. ఇప్పుడు ప్రభుత్వ బడులు సైతం బాగున్నాయి.

– బలే రాజేశ్వరి, పెదయాగనమిల్లి

సీఎం జగన్‌తోనే సంక్షేమ పథకాలు


తోటగూడెంలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న కొఠారు రామచంద్రరావు, నాయకులు

పెదపాడు : ప్రజల ఖాతాల్లోకి సుమారు రూ.3 లక్షల కోట్లు జమచేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ మాజీ అధ్యక్షుడు కొఠారు రామచంద్రరావు అన్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు నేను సిద్ధం .. మా ఊరు సిద్ధం కార్యక్రమం బుధవారం పెదపాడు మండలం తోటగూడెంలో నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సీఎం జగన్ ప్రతి ఇంటింటికీ పథకాల ద్వారా రూ.1 లక్ష నుంచి రూ.8 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. మరలా సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగన్మోహనరెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరముందన్నారు. సీఎం జగన్ నిలబెట్టిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కొఠారు అబ్బయ్యచౌదరి, కారుమూరి సునీల్‌కుమార్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కరోనా సమయంలో ఆశించిన స్థాయిలో ప్రభుత్వానికి రాబడి రాకపోయినా కేవలం మూడేళ్లలోనే ఇంత సంక్షేమం అందించారని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ డబ్బులు ఏమయ్యాయో ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అక్కినేని గోపిచంద్ర దుర్గాప్రసాద్, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, గ్రామ సర్పంచ్ ఏనుగ అబ్రహం, మాజీ సర్పంచ్ గరికపాటి పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: మండలంలోని అర్ధవరం గ్రామంలో భక్తుల సహకారంతో నిర్మించిన సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈకార్యక్రమంలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని స్వామికి పూజలు చేశారు. వేదపండితులు, ఎంపీపీ అర్ధవరం రాము తదితరులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బుధవారం ఉదయం సీతారామచంద్ర స్వామి, లక్ష్మణస్వామి, ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, ద్వారపాలక ప్రతిష్ఠ కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాడపర్రుకు చెందిన వైఖానస ఆగమశిరోమణి, శ్రీమాన్ సుదర్శనం జనార్ధనాచార్యులు, శ్రీ పెద్దింటి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో విగ్రహప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


భీమడోలులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల నాయకులు

భీమడోలు: మండలం మరింత అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే వాసుబాబును మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజలను కోరారు. గ్రామంలోని పెరుమాళ్ల స్తంభం ఏరియాలోని ఇంటింటికి వెళ్లి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. వైసీపీ ప్రభుత్వ పాలన ప్రజా సంక్షేమ పాలనని, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. అనునిత్యం ప్రజా సంక్షేమానికి పాటుపడే సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలన్నారు. మహిళల పేరుతో పథకాలు అమలు చేశారని, అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని వారంతా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకేల చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మగుంట రంగ, మండల యూత్ అధ్యక్షుడు మద్దుల రాజా, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, సీహెచ్‌సీ చైర్మన్ చింతా రాము, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ ఆల్తి శ్రీనివాస్, నాయకులు సుతాపల్లి ప్రసాద్, కిలపర్తి భాస్కరరావు, ఆల్తి సురేష్, చింతా చందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌పై తస్మాత్..


ఎన్నికలపై సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో టి.స్వర్ణలత

భీమడోలు: ఎన్నికల కోడ్‌పై అప్రమత్తంగా ఉండాలని భీమడోలు ఎంపీడీవో టి.స్వర్ణలత, తహసిల్దార్ జి.వరహాలయ్యలు అన్నారు. భీమడోలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ కార్యదర్శి ఎస్.ఠాగూర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, తహసీల్దార్‌లు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలని, నిబంధనలు పాటించకుంటే ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు తీసకుంటామన్నారు. ప్రైవేటు స్థలాల్లో రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉండాలంటే విధిగా ఎన్నికల కమీషన్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో నిష్పాక్షపాతంతో మరింత పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. రాజకీయ నాయకుల ప్రచారంలో ఉద్యోగులు పాల్గొనవద్దన్నారు. నిబంధనలు పాటించకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహాల ప్రతిష్ఠ


విగ్రహాల ప్రతిష్ఠామహోత్సవంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: సోమవరప్పాడు బీసీ ఏరియాలో ఉన్న రామాలయంలో బుధవారం విగ్రహాల ప్రతిష్ఠామహోత్సవం అర్చకులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, గ్రామ సర్పంచ్ సరిగే నాగరాజు, సొసైటీ చైర్మన్ వేమూరి బసవపున్నయ్య, సొసైటీ మాజీ అధ్యక్షులు మేకా సాంబశివరావు స్వామివారికి ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత వేమూరి జితేంద్ర, సరిగే నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేషవస్త్రాలు అందచేసి, స్వామివారి జ్ఞాపికలతో సత్కరించారు.

మహిళల పట్ల అసభ్య సైగలు తగదు

పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు ఆగ్రహం


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఘంటా ప్రసాదరావు

దెందులూరు: మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అసభ్య సైగలు చేయడం టీడీపీ, జనసేన శ్రేణులకు తగదని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీకి వస్తోన్న జనాధరణను చూసి టీడీపీ, జనసేన శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయని ఆరోపించారు. ప్రజాప్రతినిధులైన జెడ్పీటీసీ నిట్టా లీలాన వకాంతం, సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మలు మంగళవారం రాత్రి మేము సిద్ధం.. మా గ్రామం సిద్ధం కార్యక్రమంలో తిమ్మన్నగూడెంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరితో కలిసి పాల్గొన్నారని చెప్పారు. ఆ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పిప్పర దుర్గా ప్రసాద్ మహిళా ప్రజాప్రతినిధులు పట్ల అసభ్యంగా సైగలు చేయడాన్ని తప్పుపట్టారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అందరికీ నమస్కారం పెడితే తిరిగి కూర్చొని నమస్కారం చేసినందుకు తమపై దాడి, దౌర్జన్యం చేశారని టీడీపీ కార్యకర్త, నాయకులు బుధవారం ఉదయం నుంచి అసత్య ప్రచారాలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ చర్యలకు పాల్పడిన వ్యక్తులను వెనుక నుంచి ప్రోత్సహించడం చింతమనేని ప్రభాకర్‌కు తగదని హెచ్చరించారు. జెడ్పీటీసీ లీలా నవకాంతం మాట్లాడుతూ మహిళలమని కూడా చూడకుండా అసభ్యంగా చేతులతో సైగలు చేయడం తమను ఎంతో బాధించిందని, ఇలాంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేనలను శాశ్వతంగా ఇంట్లో కూర్చోబెడతారని హెచ్చరించారు. పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని మాట్లాడుతూ తమను వైఎస్సార్ సీపీ నాయకులు కొట్టారని, తిమ్మన్నగూడెం సభకు రాని నాయకుల పేర్లు పెట్టడాన్ని బట్టి ఈ ఘటనలో వాస్తవం ఇట్టే అర్థమవుతుందన్నారు. బ్యాండేజీలతో ముద్రగడ భరత్ అనే వ్యక్తి వీడియోలు చేసి అన్ని ప్రచార సాధనాలకు తప్పుడు సమాచారం అందజేశారని వివరించారు. ఆసుపత్రిలో ఉన్న బ్యాండేజీ ఉదయం గ్రామంలోకి రాగానే ఏమైందని ప్రశ్నించారు. బ్యాండేజీ ఉన్న ఫొటోను, గ్రామంలో బ్యాండేజీ తీసేసిన ఫొటోను నాని విలేకర్లకు చూపించారు. ముద్రగడ భరత్‌పై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఎన్నికల కోడ్ పాటించాలి

ఉంగుటూరు: ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పాటించాలని ఉంగుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఖాజావల్లి అన్నారు. బుధవారం ఉంగుటూరులో తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజావల్లీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సమావేశాలకు అనుమతులు ఎలా పొందాలో వివరించారు. నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. సువిధ పద్ధతి ద్వారా అనుమతులు ఎలా పొందాలో వివరించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఉంగుటూరు: మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కైకరం వనచర్ల ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి ప్రారంభించారు. వెన్నుముక నిపుణుడు తేజో ఫణీంద్ర పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. మానవత ప్రాంతీయ చైర్మన్ పుప్పాల గోపి మాట్లాడుతూ తేజో ఫణీంద్ర పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 236 మందికి పరీక్షలు నిర్వహించారు. ఉపసర్పంచ్ మట్టా మురళీ, మానవత మండల అధ్యక్షుడు గంజిరవి, ప్రతినిధులు శీతాల సత్యనారాయణ, గుణ్ణం బుల్లి య్య, కోనే వీరవెంకటసత్యనారాయణ, ఎంపీటీసీ పంతులు వెంకన్న, గుత్తికొండ కృష్ణారావు, గంజి ప్రభాకరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రచారం


నిడమర్రులో ఇంటింటికీ ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


అప్పనవీడులో ప్రచారం చేస్తున్న అప్పన ప్రసాద్

నిడమర్రు: ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికీ వెళ్లి వివరించాల్సిన బాధ్యత ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్తపై ఉందని మండల ఆర్‌బీకే చైర్మన్ పోలిశెట్టి రమేష్ తెలిపారు. బుధవారం నిడమర్రులో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నిడమర్రులో నిర్వహించిన ప్రచారంలో మండల ఆర్‌బీకే చైర్మన్ పోలిశెట్టి రమేష్ మాట్లాడుతూ మీ ఇంటికి మంచి జరిగిందంటేనే జగనన్నను రెండోసారి సీఎం చేసేందుకు మీ ఓటు ద్వారా మద్దతు తెలపాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాట్నూరి ఉమా, మండల పార్టీ అధ్యక్షుడు గుడిసె జాన్, ఉపసర్పంచ్ పోలిశెట్టి మురళి, ఎంపీటీసీ దూసనపూడి సత్యనారాయణ, పతివాడ శ్రీను, అంబళ్ల శ్రీను, పెద్దిరెడ్డి సత్యనారాయణ, సేనాపతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై ఇంటింటా ప్రచారం

పెదపాడు: లబ్ధి చేకూరిందని భావిస్తేనే ఓటేయండని చెప్పగలిగే ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ పెదపాడు మండల కన్వీనర్, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పనప్రసాద్ తెలిపారు. మండలంలోని అప్పనవీడులో ఆయన ఆధ్వర్యంలో నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారికి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి, గ్రామ సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, ఎంపీటీసీ బుద్దే రామసీత తదితరులు పాల్గొన్నారు.

పెదపాడులో..

నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం కార్యక్రమాన్ని పెదపాడు గ్రామంలో పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటా సంక్షేమ పథకాలపై ప్రచారం చేశారు. సీఎం జగన్‌ను మరోసారి బలపర్చాలని కోరారు. వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ పరీక్షకు 989 మంది హాజరు

పెదపాడు : పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షకు మండలంలోని ఏడు కేంద్రాల్లో 1,076 మందికి 989 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు. 87 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

పెదవేగి మండలంలో భారీ వర్షం

పెదవేగి : అల్పపీడన ద్రోణి ప్రభావంతో మండల వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం నుంచి చలిగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం వడగల్ల వాన, భారీ శబ్దాలతో పిడుగులు పడి ప్రజలను బయభ్రాంతులకు గురిచేశాయి. ఈ వర్షం పంటలకు నష్టమని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రామాలయానికి శంకుస్థాపన

పెదవేగి : పెదవేగి మండలం కవ్వగుంట గ్రామంలో సీతారామాలయ నిర్మాణానికి విశాఖపట్నంకు చెందిన అర్చకుడు లక్ష్మణ స్వామి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బెనర్జీ రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లాలమ్మ గ్రామోత్సవం

ఉంగుటూరు: మండలంలోని రాచూరు పల్లాలమ్మ అమ్మవారి ఆలయం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఉత్సవ కమిటి మంద శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

గణపవరం: రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని నిడమర్రు సీఐ ఎంవీ. సుభాష్, గణపవరం ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు ప్రజలకు వివరించారు. బుధవారం గణపవరం పోలీస్ ఐలెండ్ సెంటర్‌లో ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమావళి, ఓటుహక్కు వినియోగం, రాజకీయ పార్టీల ఒత్తిళ్ల, ఓటర్లకు ప్రలోభాలు గురించి వారికి అవగాహన కల్పించారు. అనవసర వివాదాల్లోకి వెళ్లవద్దని, ఎన్నికలు ప్రశాంతంగా సక్రమంగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాధవస్వామి, రామలింగేశ్వరస్వామి కల్యాణాలు

ఉంగుటూరు: మండలంలోని రాచూరు మాధవస్వామి, రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక పూలతో ఆలకరించారు. భక్తులు స్వామివార్లును దర్శించుకున్నారు. దేవాదాయ ధర్మదాయ శాఖ ఈవో కలగర శ్రీనివాసరావు పర్యవేక్షించారు.